క్లుప్తంగా

అబిద్‌నగర్ పార్కు అభివృద్ధికి సహకారం

సీతంపేట: ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ మేనేజర్ ఆపరేషన్స్ వై.కె.కె.శాస్త్రి, క్లస్టర్ హెడ్ ఆర్.విజయశ్రీ, బ్రాంచి మేనేజర్లు ఎం.బి.రాజేష్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో అబిద్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు యు.కిశోర్, ఎస్.వి.ఆర్.ప్రసాద్, జఫ్రుల్లా ఖాన్, ఎస్.ఎస్.మూర్తి, ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి ఎఫ్‌సీఐ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య వీటిని పర్యవేక్షించారు. కంచరపాలెం, కప్పరాడ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కె.కాలనీ, సుభాష్‌నగర్, రాంజీ ఎస్టేట్ తదితర పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు



బాలికలకు ఐరన్ మాత్రలు అందిస్తున్న ఆశా వర్కర్ స్వాతి

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కంచరపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పి.మణి, గోక స్వాతి పర్యవేక్షణలో బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేసి, ఐరన్ మాత్రలు అందించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



రికార్డు రూంలో పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ తీరుతెన్నులపై సీఐ ఎస్.విజయకుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కొద్ది కాలంగా రికార్డు రూంలో భద్రపరచిన పలు కేసుల్లో ఉన్న వస్తువులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల రికార్డులకు ప్రాధాన్యమిచ్చి భద్రపరచాలన్నారు. స్టేషన్‌తోపాటు ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఆట.. పాట.. చదువు

- బుజ్జాయిల తొలి బడి.. అంగన్‌వాడీ
- ప్రైవేట్‌కు దీటుగా ప్రీ స్కూల్ నిర్వహణ



ఆకర్షణీయంగా ఆంగ్ల అక్షరాలు



రైల్వే న్యూకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో క్రమశిక్షణతో అక్షరాలు నేర్చుకుంటున్న చిన్నారులు

తాటిచెట్లపాలెం: బుడి బుడి అడుగులేస్తూ, చిట్టి చిట్టి చేతులతో అద్భుతాలు చేస్తూ ఏదో నేర్చుకోవాలనే తపనతో చదువు, క్రమశిక్షణ, ఆటపాటల కోసం చిన్నారులు వేసే తొలి అడుగు అంగన్‌వాడీ బడి. దీనిని నేడు ప్రభుత్వం ప్రీ ప్రైమరీగా పిలుస్తోంది. చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించే ముందు అలవాటు కోసం నర్సరీ, ప్లే స్కూల్స్ వంటివి అందుబాటులో ఉన్నాయి. ఇవి కొంచెం స్తోమత ఉన్న వారికి మాత్రమే. పేద పిల్లల చదువుకు శ్రీకారం దిద్దే కార్యక్రమం నేడు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్నారు.

గతంలో కంటే మార్పు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ సెంటర్ల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో కంటే వసతులు మెరుగయ్యాయి. జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ చిన్నారుల సంఖ్య పెరిగింది. ఈ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలు సరాసరి ఇదే ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలకు బదిలీ అవుతున్నారు. దీంతో అంగన్‌వాడీ తరువాత ఎక్కడికెళ్లాలో అనే చింత చిన్నారులకు గానీ, తల్లిదండ్రులకు గానీ లేదు. ప్రస్తుతం ఈ ప్రీ స్కూల్‌లో 30 మంది చిన్నారులు ఉన్నారు. వీరంతా ఎంతో క్రమశిక్షణతో మెలుగుతున్నారు. చక్కగా వరుసలో కూర్చుని భోజనాలు చేయడం, చదువుకోవడం, ఆడుకోవడం చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది. అంగన్‌వాడీ టీచర్, సహాయకురాలు పిల్లలను ఎంతో చక్కగా చూసుకుంటున్నారు. ప్రైవేట్ ప్లే స్కూల్స్, నర్సరీ స్కూల్స్‌కు దీటుగా ఈ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు పలు విషయాలను నేర్చుకుంటున్నారు.

సంపూర్ణ పోషణ.. మెచ్చేలా బోధన

అంగన్‌వాడీ సెంటర్లలో సంపూర్ణ పోషకాహారాన్ని చిన్నారులకు అందజేస్తున్నారు. ఆటపాటలతో కూడిన విద్యను పిల్లలకు బోధిస్తున్నారు. విభిన్న వస్తురూపాలతో ఇంగ్లిష్, తెలుగు అక్షరాలు, అంకెలను నేర్పిస్తున్నారు. ఆగస్టు 15న రైల్వే న్యూకాలనీ అంగన్‌వాడీ చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కొందరు ప్రత్యేకంగా పాటల ద్వారా తమ ప్రతిభ చాటుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అంగన్‌వాడీ సెంటర్లు మరింత ఆకర్షణీయంగా, చిన్నారుల్లో ఆనందాలు నింపే తొలి బడిగా సాగిపోతున్నాయి.

ఇన్నోవేషన్ చాలెంజ్‌లో మధురానగర్ హైస్కూల్ ఫస్ట్



ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ గ్రాండ్ ఫినాలేలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పాఠశాల విద్యా శాఖ, యూనిసెఫ్ సంయుక్తంగా ఆగస్టు 28 నుంచి 30 వరకు విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలో సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు దుర్గా కాత్యాయిని, జోష్ నాగేంద్ర, జశ్వంత్, ప్రదీప్‌కుమార్ ×సెక్యూరింగ్ ఫార్మ్స్ ఫ్రం యానిమల్స్ యూజింగ్ లేజర్ టెక్నాలజీ× అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీ, లక్ష రూపాయల నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను విద్యార్థులు అందుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన సభలో హెచ్‌ఎం పి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతిభ చూపిన విద్యార్థులను, ప్రాజెక్టు రూపకల్పనలో గైడ్‌చేసిన సైన్స్ టీచర్ ఎం.ఎ.భ్రమరాంబను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లోకి జంతువులు వచ్చినపుడు లేజర్ లైట్ ద్వారా సిగ్నల్ వెళ్లి అలారం మోగడంతో పంటను వాటి బారి నుంచి కాపాడుకునేలా విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారన్నారు. ఇటీవల అలిపిరి మెట్ల మార్గంలో చిరుతపులి వచ్చిన సంఘటన జరిగిందని, దాని నుంచి రక్షణగా మెట్ల మార్గానికి ఇరువైపులా లేజర్ లైట్స్ సాయంతో అలారం మోగేలా చేయొచ్చని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును చూసి న్యాయనిర్ణేతలు మొదటి బహుమతి ప్రకటించారన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన 27 పాఠశాలలు ఈ తుది పోటీలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం చాలా గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని ఆకాంక్షించారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు



అధికారులు, ఉద్యోగులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉద్యోగులతో తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు రావడంతో వాటి పంపిణీ కార్యక్రమంపై చర్చించారు. ప్రభుత్వ స్థలాలపై రీసర్వే చేయాలని, ఎటువంటి అక్రమాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గెడ్డలు, స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే తెలియపరచాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఆర్ఐ, ఇబ్రహీం, వీఆర్వోలు పొన్నాడ నాగేశ్వరరావు, మూర్తి, నాగేశ్వరరావు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగబంధం విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్, సీతంపేట పెద్దలు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద గురువారం నాగబంధం విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు శివగణేష్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ మోకర వెంకటరావు దంపతుల చేత ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ విగ్రహానికి క్షీర, పంచామృతా, అన్నాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, ముడ్డల రాజారావు, ముడ్డల పాపారావు, ఇసరపు అప్పారావు, సానబోయిన సురేష్, వారాధి యర్రాజి, బోర గోవింద్, బోర శ్రీను, సారిపిల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ హనుమాన్ చాలీసా పారాయణ రేపు

దాబాగార్డెన్స్: అప్పయ్యనగర్‌లోని భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2న వెంకటేశ్వర ఫౌండేషన్, అప్పయ్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి బి.హరినాథ్, శ్రీహరే రామ సంకీర్తన భక్త బృందం ఉపాధ్యక్షుడు ఎంపీ రాజశేఖర్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి సహకారంతో ఆ రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు శ్రీహరే రామ సంకీర్తన భక్త బృందం కార్యదర్శి సుధా సీతాపతిరావు నేతృత్వంలో 108 సార్లు చాలీసా పారాయణ నిర్వహిస్తామన్నారు.

వైభవ వెంకన్నకు పంచామృతాభిషేకం



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణిమ(హైగ్రీవ జయంతి) సందర్భంగా గురువారం శ్రీవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్చారణతో ఆలయ అభిషేక ప్రదక్షిణ చేశారు. అనంతరం వైభవుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలారసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఉదయం 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం, 10.30 గంటలకు అలంకార దర్శనం కల్పించారు. అర్చక స్వామి శేషాచార్యులు ప్రధాన అర్జిత సేవలో పాల్గొన్న దాతలకు శ్రీవారి శాలువా, కండువా, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. మంగళాశాసనాలు. తీర్థప్రసాద గోష్టితో కార్యక్రమం ముగిసింది. ఆలయ కార్యనిర్వహణధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

4 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి యువకులకు రిమాండ్

మర్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో బెంగుళూరుకు చెందిన నందిగుడి సచిన్, మంజునాథ సుదీప్ అనే ఇద్దరు యువకులు అనుమానస్పదంగా సంచరించడంతో దాడులు చేసి వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి బెంగుళూరులో అధిక ధరకు విక్రయించడానికి తరలిస్తున్న సమయంలో గురువారం మధ్యాహ్నం వీరిని పట్టుకున్నారు. కంచరపాలెం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఏడీఎం యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో గురువారం రాత్రి జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లతోపాటు కూరగాయలు, ఇతర స్టాళ్లను పరిశీలించారు.

సాయంత్రం బజార్‌కు వచ్చే రైతుల ఐడీ కార్డులు, వారి రికార్డులను, కాటాలను పరిశీలించి మాట్లాడారు. ఈ-క్రాప్ ద్వారా పంట పొలాలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీదళార్చన, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు గురువారం నాటికి 15వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ ప్రత్యేక పూజలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 వరకు గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.

2న 'నీ స్నేహం కోసం..'

దాబాగార్డెన్స్: ప్రముఖ గిటారిస్ట్ కన్నాజీ స్మారకార్థం ఈ నెల 2న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నీ స్నేహం కోసం' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సుప్రీం ఆర్కెస్ట్రా ఇంటర్నేషనల్ లైవ్ బ్యాండ్ అధినేత డాక్టర్ సుప్రీం శేఖర్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీం శేఖర్ మాట్లాడుతూ అనేక సినీ సంగీత కార్యక్రమాల్లో గిటార్ వాయిద్యంతో ఖ్యాతిగాంచిన కన్నాజీ జ్ఞాపకార్థం నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకుడు డేవిడ్, నందిత, రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, సునీత, అబిద్, అలీ తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ప్రత్యేక సంగీత వాయిద్యాలతో సీనియర్ కళాకారులు అలరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పారుల్‌కుమార్, నేవీ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కన్నాజీ తల్లి వసుందరాదేవిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గాయకులు రాజేంద్రప్రసాద్, నందిత, కీబోర్డు ఆర్టిస్ట్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ



మాధవధార హైస్కూల్‌లో జ్ఞాన సరస్వతి విగ్రహం



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

మర్రిపాలెం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు పొన్నాడ అప్పారావు మాస్టర్, సుజాత దంపతులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎక్కడ సరస్వతీదేవి కొలువై ఉంటుందో అక్కడ విద్యార్థులకు ఉన్నత విద్య లభిస్తుందని, తద్వారా పైస్థాయికి చేరుకుంటారన్నారు. ఇదే స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన అప్పారావు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. లజపతిరాయ్ మాట్లాడుతూ స్కూల్ ఆవరణలో చదువుల తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం స్వయంగా ఆమె ఇక్కడ జన్మించినట్టు అనిపిస్తోందన్నారు. కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ తన వార్డులోని పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో సరస్వతీదేవిని దర్శించుకుని జగన్నన్న లక్ష్యాన్ని చేరుకుని, ఇంగ్లిష్, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, సనపల నారాయణ స్వామి, పైడి ప్రతాప్, ఏఎస్ నాయుడు మాస్టర్, పొన్నాడ రాంబాబు, వేణు, శివరాం, మురళీధర్, పొన్నాడ మాధవ్, పైడి కృష్ణారావు మాస్టారు, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాఖీ పండగ.. ఆనందం నిండుగా...



ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ రమాదేవి



కంచరపాలెంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టి ప్రేమానుబంధాలను చాటారు. మిఠాయిలు తినిపించి దీవెనలు పొందారు. చిన్నా.. పెద్దా అని తేడా లేకుండా అంతా కలిసి సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. ప్రతి ఇంటా రాఖీ పండగ శోభ నెలకొంది. కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం బర్మాక్యాంప్ తదితర ప్రాంతాల్లోని వీధులన్నీ రక్షా బంధన్ వేడుకలతో కళకళలాడుతూ కనిపించాయి. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి ఆత్మీయ ఆనందాన్ని పంచుకున్నారు.

ముత్తంశెట్టికి రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీస్

సీతమ్మధార: మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమాదేవి రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు. సీతమ్మధారలోని ముత్తంశెట్టి నివాసంలో ఆయనకు రమాదేవితోపాటు పలువురు మహిళలు రాఖీలు కట్టి ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు.

బౌద్ధాలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బౌద్ధ సమాజం ప్రతినిధులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం శ్రావణ మాస శుద్ధ శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీనియర్ ఉపాసకుడు కోన వెంకటరావు బౌద్ధుని చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, బౌద్ధ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వరుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శివయ్య

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు.

షిర్డీసాయి పాదుకల ప్రతిష్ట

ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో పాదుకలు ప్రతిష్ఠించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ దత్తాత్రేయుడి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. అర్చకుడు రామారావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మహేష్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు, సిబ్బంది శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

క్రైం పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఏసీపీ

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ క్రైం పోలీస్ స్టేషన్లను గురువారం ఏసీపీ(క్రైం) వెంకటరావు సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల్లోని రికార్డులను ఆయన తనిఖీ చేసి, పాత కేసులపై ఆరా తీశారు. సిబ్బంది నైట్ డ్యూటీల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల కట్టడికి రాత్రి పూట ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎళ్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిహార్, సిబ్బంది పాల్గొన్నారు.

- ద్వారకా జోన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఉదయం డీసీపీ నాగన్న సందర్శించనున్నారు.

సృజనాత్మకతే సంపద

ఏయూ క్యాంపస్: సృజనాత్మకతే పెద్ద సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తెలిపారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు' అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.విజయశాంతి స్మారకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా రెక్టార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్స్‌ను స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఏ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు.